# శ్రీ రమణ జ్యోతి

సంపుటి-45 సంచిక - 5 హైదరాబాదు మే, 2025 పేజీలు - 52 రూ. 10/- సంవత్సర చందా : రూ. 100/-

# SRI RAMANA JYOTHI

Vol - 45 Issue - 5 Hyderabad May, 2025 Pages - 52 Rs. 10/- Annual Subscription Rs. 100/-



**BHAGAVAN SRI RAMANA MAHARSHI**



*ARUNACHALA HILL* (అరుణాచల గిరి)

స్మరణమా త్రముననె పరముక్తి ఫలద । కరుణామృ తజలధి యరుణాచ లమిది ॥

| శ్రీ రమణ జ్యోతి | **Sri Ramana Jyothi** |
|---|---|
| మే 2025 | May 2025 |
| ఈ సంచికలో ... | IN THIS ISSUE ... |


| | | | |
|---|---|---|---|
| **1.** | **డా॥ కే.యస్. గారి 129వ ప్రవచనం** | వి. రామదాస్ మూర్తి | 3 |
| **2** | **దిలీప్ కుమార్ రాయ్** | సరోజా ప్రసాద్ | 12 |
| **3.** | **శాంత రంగాచారి** | రవికృష్ణ శర్మ | 15 |
| **4.** | **భగవాన్ భక్తులు - గోవులు** | వి. రమేష్ బాబు | 26 |
| 5. | The Desire for Respectability | Dr K Subrahmanian | 30 |
| 6. | Ashtavakra Gita 36 | V Krithivasan | 38 |
| 7. | Smt S Subbalakshmi Ammal | Sneha Choudhury | 42 |
| 8. | Suranna | TR Kanakammal | 46 |
| 9. | Sri Ramana, the Divine Sage | Swami Sivananda Saraswati | 48 |


## Events in Sri Ramana Kendram in May 2025

1. Satsang - Every Sunday - 9.00 - 10.45 a.m.
2. 3rd, 30th - Punarvasu Satsang - 6.30 - 7.30 p.m.
3. 3rd Sunday - Meditation - 9.00 - 10.45 a.m.
4. 21st Mahapuja

(పాఠకులు దయచేసి తమ ఫోన్ నంబరు,e- మెయిల్ అడ్రెస్, శ్రీ రమణకేంద్రం ఆఫీసుకు వెంటనే ఫోన్ చేసి తెలియజేయగలరు)

(Readers are requested to kindly intimate the Sri Ramana Kendram Office, their Phone Number and e-mail address)

© Copyrights of all the material used from Sri Ramanasramam publications in Sri Ramana Jyothi either in excerpted form, translated form or serialised form totally belong to Sri Ramanasramam, Tiruvannamalai.

**శ్రీ రమణజ్యోతి వ్యవస్థాపకులు: కీ॥శే॥ డా॥ కె. సుబ్రహ్మణియన్**
**(వ్యవస్థాపక అధ్యక్షులు, శ్రీరమణకేంద్రం)**

# అవసరం ఉంటేనే మాట

డా॥ కే.యస్. గారి 129వ ప్రవచనం

అనువాదం: వి. రామదాస్ మూర్తి

మనము గురువులు, మహాత్ముల వద్దకు వెళ్తూ ఉంటాము. వారితో మాట్లాడటానికి కాకుండ వారిని చూడటానికి వెళ్ళవచ్చు. అలా వెళ్ళడాన్ని దర్శనము అని అంటాము కానీ భాషణము కోసము వెళ్ళాము అని అనము. సహజముగా మహాత్ములు అసలు మాట్లాడరు. కానీ వాళ్ళ సమక్షములో మనము వర్ణించలేని శాంతిని అనుభవిస్తాము. అదే మీరు నా వద్దకు వచ్చారంటే మీరు నాతో మాట్లాడతారు, నేను ఒక గంట పాటు మాట్లాడవచ్చు. కానీ ఆ గంట సమయము తరువాత కూడా మీ అనుమానాలు తగ్గకపోగా మరింత ఎక్కువ కావచ్చు. కానీ, ఆత్మ సాక్షాత్కారం పొందిన మహనీయులు మాట్లాడవలసిన అవసరము లేదు. వారు ప్రసరింప జేసే శాంతి ప్రవాహము మాత్రము మాటలు లేకుండగానే సాగిపోతుంది.

**చిత్రమ్ వటతరోర్మూలే వృద్ధాః శిష్యా గురుర్యువా ।**

**గురోస్తు మౌనం వ్యాఖ్యానం శిష్యాస్తు ఛిన్న సంశయాః ॥**

ఆదిశంకరులు దక్షిణామూర్తిని వర్ణిస్తూ అంటారు; వటవృక్షం క్రింద ఒక గురువు కూర్చొని ఉంటాడు. సామాన్యంగా, శిష్యుని కంటే గురువు పెద్ద వయస్సు వారై ఉండాలి. కానీ, ఇక్కడ గురువు బాలుడు. అతనే దక్షిణామూర్తి. అక్కడ ఉన్న శిష్యులు వృద్ధులు. అది కొంత విచిత్రంగా ఉంటుంది. మామూలుగా గురువులు ఏదో

బోధ చేస్తూ ఉంటారు. కానీ, ఇక్కడ గురువు అసలు మౌన ముద్ర దాల్చి ఉంటారు. నోరు తెరిచి ఏమీ మాట్లాడరు. ఆశ్చర్యకరమైన విషయమేమిటంటే శిష్యుల సందేహాలన్నీ నశించిపోతాయి. అందుకే అన్ని విధాల ఇది అసాధారణ పరిస్థితి.

**మౌనంతో శాంతి**

భగవాన్ కూడా చాలా మటుకు మౌనంగానే ఉండేవారు. మహర్షి తిరువణ్ణామలై దాటి జీవిత కాలమంతా ఎక్కడికీ వెళ్ళలేదు. ప్రవచనాలు ఎప్పుడూ ఇవ్వలేదు. ఎవరైనా అడిగితే అరుదుగా ఒకటి రెండు వాక్యాలు మాట్లాడేవారు. ఆయన మౌనంలోనే శాంతి లభిస్తుందని ఆయనను దర్శించడానికి వచ్చినవారు చెప్పేవారు. అది ఎలా సాధ్యము అని మనము అనుకుంటాము. కానీ సాధారణ పరిస్థితులలోనూ అలాంటిది జరుగుతుంది.

మిమ్మల్ని నేను మొదటిసారి చూసినప్పుడు మీరు ఎవరు? ఏమి చేస్తుంటారు? వివాహమైందా? పిల్లలు ఉన్నారా? ఇలాంటి ప్రశ్నలు అడుగుతాను. మీరూ అలాంటి సంగతులనే అడుగుతారు. అంటే, నన్ను మొదటిసారి పరిచయం చేసుకున్నప్పుడు మీ విషయాలు తెలియడానికి ఆ ప్రశ్నలు అవసరం అవుతాయి. అలాగే మీరు కూడా. మరో విధంగా చెప్పాలంటే మాటల ద్వారా సమాచారం తెలియవస్తుంది. ఆ పరిస్థితుల్లో మాట్లాడడం అవసరం.

ఐదారు సార్లు మనము కలిసిన తరువాత, అన్ని ప్రశ్నలు వేయాల్సిన అవసరముండదు. అలా కలుస్తున్న కొద్దీ, నేను మాట్లాడడం తక్కువ అవుతూ పోతుంది. ఆ దశలో మీరు మా

ఇంటికి వస్తే మనము మాట్లాడకుండా కూర్చుని ఉండగలము. ఇద్దరూ ఏ పుస్తకాలనో చదువుతూ గడపవచ్చు. ఎక్కువ మాట్లాడం. అంటే, అవగాహన పెరిగే కొద్దీ మాట్లాడే అవసరం తగ్గుతుంది.

వివాహమైన క్రొత్తలో, భార్యాభర్తలు ఎక్కవగా మాట్లాడుతూ ఉండవచ్చు. కొన్ని సంవత్సరాలు గడిచాక ఒకే గదిలో ఉన్నప్పటికీ మాట్లాడాల్సిన అవసరం ఉండదు. అవగాహన పెరిగే కొద్దీ మాటలు తగ్గుతాయి. కొన్ని సందర్భాలలో అయితే మౌనంగానే మన భావాలను తెలియజేసుకొనడం జరుగుతుంది. ఎవరైనా మరణించిన విచారకర పరిస్థితుల్లో పలకరించడానికి వెళ్ళినప్పుడు మన సానుభూతిని వీలైనంత తక్కువ మాటల్లో తెలియపరుస్తాం. మౌనంతోనే మన భావాలను వ్యక్తీకరిస్తాం.

**మానసిక మౌనం**

మౌనమంటే మాట్లాడకుండా ఉండడం కాదు. మనస్సే మౌనంగా ఉండడం. సంస్కృతంలో మౌనమంటే మానసికమైన అలజడి లేకుండా ఉండడం. ఆ స్థితిలో మనశ్శాంతి ప్రభావం ఇతరులకు తెలుస్తుంది. సిద్ధులు, మునులు ఆ స్థితిలో ఉండి భాషను వాడకుండా ఇతరులకు మనశ్శాంతిని పంచగలరు. భగవాన్ అందుకే పూజ, జపము, ధ్యానము మొదలైన వాటిలో నిమగ్నమై ఉండడం ద్వారా మానసిక అలజడి నశింప చేయవచ్చును అనేవారు. కానీ దానికి సమయం పట్టడమే కాకుండా భగవత్కృప తప్పక ఉండాలి.

తొలి దశల్లో అంటే మనమింకా చిన్న వయసులో ఉన్నప్పుడు

మనకు తరచూ ఏదో ఒక విషయంలో వాదించే అలవాటు ఉంటుంది. మనకు తెలుసు అనుకుంటాము. పెరిగే కొద్దీ మనకు తెలిసింది చాలా కొంచమేనని అర్థమవుతుంది. అప్పుడు అంతగా వాదనలోకి దిగం. ఒకే విషయంపై పలు దృక్పథాలు ఉంటాయి. తెలుసును అనుకుంటాము కానీ, మనకు తెలియకపోవచ్చు.

మనకు ఫలానా వాళ్లు తెలుసునని అంటాం. దాని అర్థం ఏమంటే ఆ వ్యక్తిని కలిశాము. అతని ప్రతిస్పందనలు కొన్ని సందర్భాలలో ఎలా ఉంటాయో అని తెలుసు. అతనికి తీపి పదార్థాలు ఇష్టమని తెలుసు. వాటిని మించి మరింకేమీ తెలియక పోవచ్చు. ఇలాంటివన్నీ పైపై విషయాలు మాత్రమే. ఈ ప్రపంచంలో కోట్లాది ప్రజలు ఉన్నారు. ఆలోచిస్తే ఇంతమందిలో మనకు నిజంగా తెలిసిన వారు ఏ ఐదుగురు ఆరుగురు ఉండవచ్చు. వాళ్లను గురించి కూడా మనకు పూర్తిగా తెలుసునని చెప్పలేము. చాలా మటుకు మనం ఊహించుకున్నవే ఉంటాయి.

**అనరాని మాట**

భర్త తన భార్య గురించి తెలుసు అనుకుంటాడు. అలాగే భార్య కూడా అనుకుంటుంది. కాని ఒకానొక సందర్భంలో కొన్నిసార్లు ఆమె అలాగ అంటుందని ఎప్పుడూ అనుకోలేదని భర్త అనుకుంటాడు. కారణం తాను ఆమెను అర్థం చేసుకున్నానని అనుకుంటాడు. మనము అలాగ అనుకుంటే, అది పొరపాటు. నా గురించి పూర్తిగా నాకే తెలియనప్పుడు ఎదుటివారి విషయంలో అలాగ చెప్పడం సాధ్యమా? ఒక్కొక్కసారి మనము అలాగ

మాట్లాడామా అని తర్వాత ఎప్పుడో మనమే ఆశ్చర్యపోతాం. నిత్యము అలా ఉండని తాను ఎలాగ అలా అన్నాను అని పశ్చాత్తాప పడుతూనే ఉంటాము. రాత్రి పడుకోబోయే ముందు మనము దాని గురించి ఆలోచిస్తూనే ఉంటాము.

దీనికి కారణం ఏమిటి? మనము వాడే భాష మీద మనకు అదుపు ఉండకపోవడం. భాష మనల్ని అదుపులో ఉంచుతుంది. మనము మాట్లాడేటప్పుడు మొదటి కొన్ని వాక్యాలు సరిగానే ఉండవచ్చు. కానీ ఆ తరువాత మాట్లాడే కొద్దీ మనమన్నది ఏమిటి అని మనకే ఆశ్చర్యమేస్తుంది. మనము చెప్పదలుచుకున్నది కాకుండా మరేదో చెప్పినందుకు విచారిస్తాం. మరుసటి రోజు అతనిని కలిసినప్పుడు ఆ సంగతి తెలుపుతాం. కానీ అదే వారం తర్వాత కలిస్తే అది ఎప్పుడో జరిగిన సంగతి కదా ఇప్పుడు దాని గురించిన ప్రస్తావన ఎందుకు అనుకుంటాం. కానీ అతను ఆ విషయాన్ని అప్పటికీ గుర్తు పెట్టుకొని ఉండడంతో మీ మీద ఒక ద్వేష భావాన్ని పెంచుకుంటాడు. మీరు అతని పట్ల పూర్వపు భావాన్ని కలిగి ఉన్నప్పటికీ, పరస్పర బంధం మారిపోతుంది.

## అంతర్గత ద్వేషం

పై సంఘటనల వల్ల బాహ్యంగా ఏ విధమైన మార్పులు కనపడకపోయినప్పటికీ అంతర్గతంగా, ఎదుటి వ్యక్తి ఆ విషయమై అసంతృప్తితోనే ఉంటాడు. ఒక వ్యక్తికి సంబంధించినదే ఈ విధంగా కృత్రిమంగా ఉంటే, ఇక ఈ ప్రపంచంలోనే ఎంతోమంది విషయంలో కూడా ఇదే జరుగుతూ ఉంటుంది. అంటే, ఇదంతా

ఒక నాటకం లాగ సాగుతూ ఉంటుందన్న మాట. మనం గతాన్ని తిరిగి రంగంలోకి తేవడం ఇష్టం లేకపోయినా దాదాపు అందరితోనూ సంబంధాలు ఇదే రీతిలో సాగుతుంటాయి. మాయ గురించి మాట్లాడినప్పుడు అలాంటిదేమీ లేదని అనుకుంటాం. అంతా యథార్థమే కదా అంటాము. సత్యమేమిటంటే ప్రపంచంలో ఇలాంటి సంబంధాలు ఉండడమే మాయ.

ఆది శంకరులు మాయని గురించి మాట్లాడుతారు. కానీ ప్రతి ఒక్కటీ, అసత్యమని అనరు. మనం ప్రవర్తించే తీరును వ్యాఖ్యానిస్తారు. నేను నిజం అనుకున్నది నిజం కాదు, నా స్నేహితుడు భావించేది నిజం కాదు. అంటే నేను ఇతరులకు చెప్పేది, వాళ్లు నా గురించి అనుకునేదీ ఏదీ కూడా నిజం కాదు. యథార్థంగా, అది సత్యం కాకపోయినప్పటికీ, కావాలనే అలా ప్రవర్తిస్తాము. అందుకే శంకరులు ఎవరికి వారు తమను గురించిన అవగాహనను కలిగినప్పుడే సరి అయిన చర్య జరుగుతుంది అని అంటారు. అది వదిలి ఇతరుల గురించి తెలుసుకునే ప్రయత్నం చేస్తాము.

నేను కెమిస్ట్రీలోనో ఫిజిక్స్ లోనో నిపుణుడిని కాదలిస్తే ఆ సంబంధిత శాస్త్రం గురించి మనస్సును కేంద్రీకరించాలి. అప్పుడు నేను దానిని నేర్చుకోగలను. అందరూ మెచ్చుకునే స్థాయికి చేరగలను. అంటే మనస్సును కేంద్రీకరించి అభ్యసిస్తేనే అది జరుగుతుంది. గుర్తుంచుకోవలసినది ఏమంటే ఇక్కడ సమస్యను అవగాహన చేసుకోవడానికి మనస్సు అవసరం అని తెలుస్తోంది.

కానీ అలాంటి మనస్సును గురించి తెలుసుకోవాలనుకుంటే మనస్సు ఆ ప్రయత్నం నుండి తప్పుకోవాలి. ముందుకు పరిగెత్తడం సులభం. వెనక్కు పరిగెత్తడం కష్టం. మనస్సు తనను గురించి తెలుసుకోవాలన్న ప్రయత్నం అలాంటిదే.

## నిన్ను గురించి తెలుసుకో

అందుకే మిగతా వాటి గురించి తెలుసుకోవాలంటే మొదట నిన్ను గురించి తెలుసుకోవాలన్న గుర్తింపు ఉండాలని భగవాన్ అంటారు. శంకరులు కూడా నీ గురించి నీవు తెలుసుకుంటే ఇక తెలుసుకునేందుకు మరేమీ ఉండదని చెప్పారు. అంతా నీవే కనుక ఇతరులలో నిన్ను, నీలో ఇతరులను చూస్తావు. నీ గురించి తెలియనప్పుడు ఇతర విషయాలు ఎన్నిటిని గుర్తించినప్పటికీ ఆనందం ఉండదు. అసలైన ఆనందం మనస్సు హృదయంలో లీనమైనప్పుడే లభిస్తుంది. అలాంటి సుఖం మనం నిద్రపోయినప్పుడు లభిస్తుంది. గాఢ నిద్రలో మనస్సు యొక్క ఉనికిని మరచిపోయినప్పుడు, మన శరీరము, పేరు, సంపద, మరి ఏ విషయమూ గుర్తుండదు. అహం అసలు ఉండదు. స్వప్నావస్థలో ఉన్నప్పుడు మనస్సు సూక్ష్మ రూపంలో ఉంటుంది. అందుకే గాఢ నిద్ర పట్టనప్పుడు కలల మూలంగా సరిగా నిద్రపోకపోతే పడుకున్నా తృప్తి ఉండదు. మనకు అప్పుడు కావలసినది శారీరక విశ్రాంతి కాదు. మానసిక విశ్రాంతి. అసలు బాగా నిద్రపోయానని చెప్పేది ఎవరు? మనస్సు అప్పుడు లేదు. శంకరులూ, అలాగే భగవాన్ కూడా నీవు నిద్రలో ఉన్నప్పుడు,

మెలకువగా ఉన్నప్పుడు కూడా మరేదో మెలకువగా ఉంటుంది అని చెప్పారు.

గాఢ నిద్రలో, మీ ప్రయత్నం ఏమీ లేకుండా మనస్సు హృదయంలో లీనమవుతుంది. మనస్సు, అహంకారము ఉండవు. మెలకువగా ఉన్నప్పుడు కూడా ప్రయత్నపూర్వకంగా ఆ స్థితిని పొందడం ఎలాగ? నేను ఎవరు అని ప్రశ్నిస్తూ దానితోపాటు పూజ, జపము, ధ్యానము వంటి వాటిని కూడా చేస్తూ ఉంటే అనుభవంతో, గాఢ నిద్రలో ఉన్నప్పటి పరిస్థితిని చేరుకోవచ్చు.

## జ్ఞాని మనస్సు వేరు

జ్ఞానికీ మనస్సు ఉంటుంది. కాని దాని స్వభావం వేరైనది. మనము, మనస్సుతో ఏమేమి సంపాదించాలి? దానికి ఏమి చేయాలి? అని నిరంతరం ఆలోచిస్తూ ఉంటాము. కోరికలు తీరనప్పుడు కలత చెందుతాం. ఉదాహరణకు, త్రాడుకు ఒక ఆకారం ఉంటుంది. అది బలంగా కూడా ఉంటుంది. త్రాడును కాల్చినప్పుడు దాన్ని కదల్చకుండా ఉంటే దాని ఆకారం మాత్రం అలాగే ఉంటుంది. కానీ త్రాడుకు ఉన్న బలం ఉండదు. దానిని తాకితే అది పూర్తి భస్మంగా మారుతుంది. అది ఉంటుంది, కానీ దాని ఆకారం మారుతుంది. అలాగే జ్ఞానికీ మనస్సు ఉన్నట్లు అనిపిస్తుంది. అహం అన్నది ఉండదు. అహంకార, మమకారాలూ ఉండవు.

అలాంటి పరిస్థితుల్లో పనులు ఏవైనా చేస్తున్నప్పటికీ, దానిని వ్యక్తిగతంగా జరుపుతున్నట్లు భావించరు. ఉదాహరణకు,

బ్యాంకులో నగదుకు సంబంధించిన పనిచేస్తున్నప్పుడు ఆ ఉద్యోగి లక్షల కొద్ది ధనం రోజులో జాగ్రత్తగా లెక్క పెట్టి ఖాతాదారులకు ఇస్తుంటాడు. కానీ ఆ ధనం తనదిగా భావింపడు.

భగవద్గీతలో కృష్ణుడు అంటాడు:

**కర్మణ్యేవాధికారస్తే మా ఫలేషు కదాచన ।**

**మా కర్మఫల హేతుర్భూః మా తే సంగోస్త్వ కర్మణి ॥**

నేను, నాది అన్న భావన లేనప్పుడు ఇతరుల కంటే మెరుగ్గా సమర్థత చూపిస్తారు. భగవంతుని చేతిలో పనిముట్టునన్న భావనతో ఆ పని చేస్తున్నది తాను కాదనుకుంటారు. మీరు ఒక కొళాయి లాంటివారు. కొళాయి గుండా నీళ్లు ప్రవహిస్తాయి. కొళాయి కర్తవ్యం తన ద్వారా నీటిని ప్రవహింప చేయడం మాత్రమే. నీళ్లు లేనప్పుడు కొళాయి బాధపడదు. నీళ్లు ఉన్నంత మాత్రాన సంతోషపడదు. అహంకారం లేనప్పుడు వ్యక్తి కూడా నీటి కొళాయి లాగే ప్రవర్తిస్తాడు. భగవంతుడు తన ఉద్దేశం ప్రకారం వ్యక్తులను వాడినప్పుడు వారిలో నేను, నాది, అన్న భావన ఉండదు.

ఆత్మానుభూతి చెందిన వ్యక్తి స్తబ్ధుగా నిర్వీర్యంగా ఉండడు. అత్యంత సమర్థవంతుడిగా ఉంటాడు. ఇష్టాయిష్టాలు లేకుండా పనిముట్టు లాగే వాడబడతాడు.

******

# మహర్షి వద్దకు నేను ఎలా వచ్చాను?
# దిలీప్ కుమార్ రాయ్

**శ్రీ రమణాశ్రమ ప్రచురణ Fragrant Petals లోని వ్యాసానికి స్వేచ్ఛానువాదం**

**సరోజా ప్రసాద్**

(దిలీప్ కుమార్ రాయ్ ప్రసిద్ధ సంగీత విద్వాంసుడు, కవి. ఆయన చాలాకాలం పుదుచ్చేరిలోని అరవిందాశ్రమంలో ఉన్నారు)

అది 1945వ సంవత్సరం. నేనింకా అరవిందాశ్రమ వాసిగానే ఉన్నాను. కాని, ఏదో నలుగురికీ దూరమైపోతున్న భావన కలిగేది. ఈ ఆశ్రమంలో నేను ఇమడలేను అనిపించసాగింది. నా దిగులు, పరిత్యక్త భావన, క్రమేణా ఎక్కువై, నాకున్న కొద్దిపాటి మనశ్శాంతి కూడా కరువైంది. దారీ, తెన్నూ లేనిచోట చిక్కుకుపోయినట్టు తోచింది. అలా ఎందుకు జరిగిందన్న మీమాంస అనవసరం. నా జీవితంలో కలిగిన మరపురాని అనుభవం గురించి మాత్రం చెప్పి తీరాలి.

వారాల తరబడి, దిగులు, విచారంలో మునిగిపోయిన తర్వాత నేరుగా శ్రీ అరవిందులకు ఉత్తరం వ్రాశాను. వెనువెంటనే అనుమతి ప్రసాదిస్తూ వారు బదులిచ్చారు. అందుకు ఎంతో సంతోషించాను.

రమణ మహర్షి దర్శనార్థం, తిరువణ్ణామలై రైలు ఎక్కాను. తీరా, రైలు బయలుదేరాక, నన్నొక వ్యథ పట్టుకుంది. నా పూజ్య గురుదేవులైన శ్రీ అరవిందుల జ్ఞానాన్ని, గొప్పతనాన్ని నేనేనాడూ శంకించలేదు. అటువంటి మహాపురుషుని వద్ద లభించిన శాంతి, నాకు గురువు కానటువంటి రమణ మహర్షి సన్నిధిలో లభిస్తుందా? అని.

మనస్సులో ఈ తర్జన భర్జన పడుతూనే, తిరువణ్ణామలైలో రైలు దిగాను. ఎటూ తేల్చుకోకముందే రమణాశ్రమ ద్వారం ముందుకు వచ్చేశాను. ఇక వెనక్కు మళ్లే ఆస్కారం లేదు, పైగా, నా గురుదేవులు అరవిందుల వలె కాకుండా నిరంతరం దర్శనం ఒసగే ఒక మహాజ్ఞానిని దర్శించి తీరాలనే తపన నన్ను ముందుకు నడిపించింది. అన్నిటినీ మించి, వారు, తమ కరుణా దృష్టితో, నన్ను నా దీనస్థితి నుండి ఎలా బయట పడేస్తారో, వారి మహిమ ఏమిటో స్వయంగా చూసి తెలుసుకోవాలన్న కుతూహలం కూడా లేకపోలేదు.

ఇన్ని సంశయాలూ, చివరికి మహర్షి సన్నిధిలో పటాపంచలైనాయి. ఇదేదో ఊహా జనితమో, భ్రమా జనితమనో చెప్పలేను. కాని, భగవంతుని లీలలు మనకు అర్థం కావు. నాకు లభించిన అనుభవం మాత్రం, కలలో కూడా ఊహించనిది. అద్భుతమైన ఆ అనుభవంతో, నా గుండెలపై మోయలేని భారమైన దిగులు ఒక్క మాటున ఎగిరిపోయింది. అంతటి గాఢమైన ఆధ్యాత్మిక అనుభవాన్ని వివరించాలంటే మాటలు చాలవు. అతి పేలవమైన ఈ శబ్దజాలంతో ఆ అలౌకిక అనుభవాన్ని వర్ణింప శక్యమా? అయినా ప్రయత్నిస్తాను....

ఎటువంటి పరుగులు లేని విశాలమైన హాలులోకి బిడియంగా ప్రవేశించాను. ఉదయం, సాయంకాలం ఈ హాలులోనే భక్తులు, సందర్శకుల మధ్య మహర్షి ఒక సోఫాపై చేరగిలబడి కూర్చొని ఉన్నారు. శూన్యంలోకి చూస్తున్నారనిపించింది. వారు నిరంతరం ఈ సహజ సమాధి స్థితిలోనే ఉంటారని చెప్పారు. నేను చూసిన

దృశ్యం, నన్ను పారవశ్యంలో ముంచెత్తింది. అయితే, దాన్ని వర్ణించే ప్రయత్నం చేయను. ఏం కనపడింది నాకు? అర్థనగ్నగా ఒక పల్చటి రూపం. మౌనంగా కిటికీ వైపు శూన్య దృక్కులతో తేరిపార చూస్తున్నారు. కాని, వారిలో మరేదో ప్రత్యేకత నాకు అనుభవ గోచరమైంది. అది అనిర్వచనీయమైన నిశ్శబ్ద సౌందర్యం, వర్ణించనలవి కాని పరిపూర్ణత.

ఆ పారవశ్య స్థితిలోనే, నేను మహర్షి పాదాలను స్పృశించి, వారి చెంతనే నేలపై కూర్చొని ధ్యానం చేశాను. అలౌకిక శాంతితో నిండిపోయిన నా గుండెలు ఎగసి పడుతున్నాయి. నా దిగులు, విచారం, అపోహలు, సంశయాలు, ప్రశ్నలు - అన్నీ ఉదయభానుడి ముందు పొగమంచులాగా కరిగిపోయాయి. దివ్యకాంతితో నిండిపోయిన విశాల సాగరంలో నేనొక శాంతికెరటంపై తేలియాడుతున్న భావన కలిగింది. గంటల తరబడి నిలిచిపోయిన ఆ పరమానందానుభూతిని వర్ణించడానికి విశేషణాలను వెతుక్కోవాలి. ఆ రాత్రి, ఆకాశంలో తారల వంక చూస్తూ పారవశ్యంలో మునిగినప్పుడు మనస్సు మహర్షి పట్ల కృతజ్ఞతా భావంతో నిండిపోయింది. వారి ఉపదేశం ఒకటి స్ఫురణకు వచ్చింది, “ఊరకే ఉండు. అంతా నీలోనే ఉన్నది. మధ్యలో కేవలం తెర మాత్రమే ఉన్నది. ఆ తెరను తొలగిస్తే చాలు. మిగిలేది నువ్వే.”

ఈ ఉపదేశం నేను ఇదివరకు విన్నదే. కాని, దాని పరమార్థం ఇప్పుడు బోధ పడింది. దానితో మహర్షిపై భక్తి పురస్సరంగా ఒక పద్యం వ్రాశాను.

******

# 4. భగవాన్ నా జీవితంలోకి ఎలా ప్రవేశించారు?

## శాంత రంగాచారి

**శ్రీ రమణాశ్రమ ప్రచురణ** Surpassing Love and Grace **లోని వ్యాసానికి స్వేచ్ఛానువాదం**

**అనువాదకులు: రవికృష్ణ శర్మ**

నా జీవితంలో గొప్ప విచారకరమైన విషయం ఏదైనా ఉన్నదంటే అది 1934వ సంవత్సరంలో నాకు ఆశ్రమం నుండి వచ్చిన ఉత్తరాన్ని పోగొట్టుకోవటం. ఆ ఉత్తరం నేను ఉన్మాద స్థితిలో ఉన్న సమయంలో తిరువణ్ణామలైలో ఉన్న భగవాన్ శ్రీ రమణ మహర్షికి, 'వ్యక్తిగతమయినది మరియు గోపనీయమయినది' అని వ్రాసి పంపిన ఉత్తరానికి వచ్చిన సమాధానము. అందులో నేను వ్రాసిన విషయము, నన్ను ఏదైనా లేక ఎవరైనా స్వల్పంగా ప్రేరేపించినా, ఒక్కసారిగా నాలో విరుచుకుపడే విపరీతమైన కోపము. అది గంభీరమైన నాకుగా నేను అంగీకరిస్తున్న బలహీనత. నా ఈ స్వభావం నా తల్లికి వేదనను కలిగించేదిగా ఉండేది. అప్పుడు నా జీవితంలో చాలా గడ్డుకాలం గడుస్తున్నది. నేను ఆరాధించే నా తండ్రి మరణించటం. నేనప్పుడే పన్నెండేళ్లు దాటి పదమూడవ ఏట అడుగిడుతున్నాను. అంతలోనే అంతా అయిపోయింది.

ఆ సమయంలో నాలో ధైర్యాన్ని నింపే ఒక మార్గ నిర్దేశకుడు, అది కూడా కుటుంబములోని వ్యక్తి కాకుండా బయటి వ్యక్తి అయితే బాగుంటుందని అనుకుంటున్నప్పుడు ఒక్కసారిగా నాకు భగవాన్ శ్రీ రమణ మహర్షి నామము గుర్తుకు వచ్చింది. మొంది

పట్టుదల గలిగి, అసహనంతో ఎల్లప్పుడూ సంశయించే వ్యక్తిత్వం కల నా తండ్రి ముఖం నుండి ఎటువంటి సాక్ష్యాధారము అవసరం లేకుండా వినిపించే నామము ఏదైనా ఉన్నదంటే, అది ఒక్క భగవాన్ నామము మాత్రమే. అందువల్ల నేను భగవాన్‌కు రహస్యంగా ఒక ఉత్తరం వ్రాశాను. అది కూడా ఎన్నో విఫల ప్రయత్నాల తరువాత ఆఖరికి మహర్షిని ఉద్దేశిస్తూ వ్రాశాను. అందులో "నాకు విపరీతమైన కోపం వస్తూ ఉంటుందనీ, దాని నుండి బయట పడటానికి నాకు సహాయపడవలసినది" అని అర్థించాను. ఒక వారం లోపల నా చేత పంపబడిన ఉత్తరం అందినదని దానిని మహర్షి ముందు పెట్టటం జరిగినదని దానికి సమాధానముగా మహర్షి నాకు ఇచ్చిన సందేశం ఏమిటంటే, నేను కనుక నా కోపాన్ని తగ్గించుకోవాలని నిరంతరము తీవ్రంగా ప్రయత్నిస్తే నేను దాని నుండి బయటపడగలను అని. వారి ఆశీర్వాదములతో సర్వాధికారిచే సంతకం చేయబడిన ప్రత్యుత్తరం నాకు అందింది.

ఆ ప్రత్యుత్తరం చదివినప్పుడు నాలో కలిగిన మొదటి ప్రతిస్పందన ఏమిటంటే నేనేదో వయస్సులో పెద్దవాడిని అన్నట్లుగా భావించి అటువంటి సలహా ఇచ్చారేమిటా అని ఆశ్చర్యపోయాను. ఎందుకంటే అప్పటివరకు నేనేమి చేయాలనేది ఎవరో ఒకరు చెప్పటమో సలహా ఇవ్వటమో సూచన చేయుటమో హెచ్చరించటమో చేసేవారు. కాని ఇలా చేయమని నాకు ఎవరూ సవాలు విసరలేదు, ఒక్క ఆటల పోటీలలో తప్ప. అటువంటిది

ఇక్కడేమో ఈ గొప్ప గురువు: “ఇది నీ కోపం, అవునా? కాబట్టి, నీకు నీవే దానిని సంభాళించుకో” అని అంటున్నారు. వారు నన్ను ఒక వ్యక్తిగా భావించి, బంతిని ఎంతో పద్ధతిగా నా కోర్ట్ లోకే విసిరారు. నాకు ఆ పద్ధతి నచ్చింది.

ఒక సంవత్సరం తరువాత నా సహోదరి మా కుటుంబ సభ్యులందరినీ తీసుకుని తీర్థయాత్రలకు వెళ్ళినప్పుడు రమణ మహర్షి మరల నా జీవితంలోకి ప్రవేశించారు. ఆ తీర్థయాత్ర మొత్తము వారం రోజుల కంటే తక్కువలో పూర్తిచేయాలని, అందులో భాగంగా రెండు రోజులు తిరువణ్ణామలైలోనే ఉండాలని అనుకున్నాము. కాని వివిధ కారణాల వలన మేము రమణాశ్రమం లోనే వారం రోజులు ఉండవలసి వచ్చింది. మేము తిరుగు ప్రయాణం చేయవలసిన రోజున నేను ఏదో కోల్పోయిన పిల్లవాడిలా బాగా ఏడ్చాను. అప్పటి నా రమణాశ్రమ సందర్శనం నాకు హృదయవిదారకమైన అనుభవాన్ని మిగిల్చింది. నేను రమణ మహర్షి ప్రేమలో పడ్డానని నమ్ముతాను. విభ్రాంతికి, పరవశతకు మాటలు లేని స్థితికి మనస్సులేని స్థితిలో మౌనంగా ఆనందాన్ని అనుభవించాను. ఈ విధమైన ప్రేమ ఏదైతే జాగృతమయిందో అది సంపూర్ణంగా భౌతికమైన ప్రేమను దాటి ఒక విభిన్నమైన చైతన్యము యొక్క అవగాహనను జాగృతపరుస్తుంది. దానిని అమనస్క ఆనందము సచ్చిదానందముగా వర్ణించవచ్చు. అది ఒక ప్రదేశంలో గుర్తించలేనిది, అంతట ఉనికిగా విస్తరించిన స్థితి. ఎప్పుడైతే  ఉనికి యొక్క స్ఫురణ మనలో కలుగుతుందో ఆ

తరువాత అది మనతోనే నిలిచి ఉంటుంది. అప్పటి నుండి మనమిక పూర్వము వలె ఉండము.

మేము తిరువణ్ణామలైకి సూర్యోదయానికి పూర్వమే వచ్చాము. ఆశ్రమానికి వచ్చి స్నానానంతరము అల్పాహారము తీసుకున్న తరువాత హాలుకు వెళ్ళాము. మా అమ్మ సహోదరుడు, మరియు సహోదరి తొందరగా నాకంటే ముందే బయలుదేరి వెళ్లి హాలులోకి అదృశ్యమైనారు. నేను అలా వెనకబడటంతో కంగారుపడ్డాను. ఆ తరువాత కాస్త కుదురుకొని గది దగ్గరకు వెళ్లి తొంగి చూస్తే, సోఫా మీద జారగిలి బంగారు - గోధుమ మేనిఛాయతో మునుపెన్నడూ చూడనటువంటి, లేదా ఇక ముందు కూడా చూడలేనటువంటి గొప్ప ప్రకాశవంతమైన ముఖంతో ఉన్న ఒక రూపాన్ని చూడగానే స్థాణువులా బిగుసుకుపోయాను. అప్పుడు మహర్షి నావైపు తిరిగి చూశారు. దానితో ఒక్కసారిగా నా కళ్ళల్లో నుండి కన్నీరు కారింది. ఆ సంఘటన జరిగి 40 సంవత్సరములు అయినప్పటికీ ఆ రోజున జరిగిన దానిని తలుచుకుంటే ఇప్పటికీ కన్నీళ్లు వస్తాయి. నేనలా ఆ రూపాన్ని చూస్తూ ఎంతసేపు నిలబడిపోయానో భగవంతునికే ఎఱుక. ఆ పరవశతలోనే ఉద్దేశపూర్వకంగా వారి వద్దకు కదలి వెళ్లి వారి పాదాలను తాకాను. నన్ను అనుసరిస్తూ వస్తున్న తట్టుకోలేనటువంటి చూపులనుండి తప్పించుకోవటానికి తీవ్రంగా ప్రయత్నిస్తూ కిటికీకి దగ్గరగా వెళ్లి కూర్చున్నాను. కూర్చున్న తరువాత కన్నీటిని కారనిచ్చాను. ఆ రోజు ఉదయం అంతా కారుతున్న కన్నీటిని తుడుచుకుంటూ కూర్చున్నాను. మహర్షి యొక్క

క్షణమాత్రపు వీక్షణం వల్ల కన్నీరు కారడంలో ఏదో ప్రయోజనము ఉంటుందని, అటువంటి ప్రయోజనము ఎప్పటికీ కలగాలని కోరుకున్నాను. అవును నేను నా గురించి ఏడ్చాను మరియు ఇప్పటికీ ఏడుస్తున్నాను.

ఇంతకు మునుపు ఇటువంటి తీక్షణమైన అంతర్ముఖత్వం చెంది చంటిబిడ్డ వలె స్వచ్ఛమైన ముఖం కలిగిన వ్యక్తిని నేను చూడలేదు. వారిలోని అడ్డుకట్ట వేయలేనటువంటి మరియు వర్ణించ లేనటువంటి ఆధ్యాత్మిక శక్తి నన్ను ముంచి వేసినది. నా చుట్టూ చాలామంది కూర్చుని ఉన్నారన్న స్పృహ ఉన్నప్పటికీ వాళ్ళేమి చేస్తున్నారనే ఆసక్తి నాకు కలుగలేదు. ఒక గంట మౌనంగా ఉన్న తరువాత ఒక్కసారిగా పాట పాడాలని అనిపించింది. ఎటువంటి సంకోచము లేదా ఇబ్బంది పడకుండా నా 12 ఏళ్ళ బాలుడి గొంతుతో త్యాగరాజ కృతి 'విననొక్కని యున్నానురా' అని నా మోకాలి మీద చేతితో తాళం వేస్తూ పాడాను. అక్కడ ఉన్నవారు కదలకుండా అలానే కూర్చున్నారు కాని వారిలో ఎటువంటి స్పందన లేదు. నా పాటకు ఎటువంటి స్పందన లేకపోవటం నాకు కొంత బాధ కలిగించినా అప్పుడు నేనున్న స్థితికి వేరే దేనినీ గ్రహించ కుండా కేవలం సోఫాలో జారగిలి కూర్చుని ఉన్న వారి యందే నా మనస్సు నిలిచింది. కొన్ని నిమిషాల తరువాత 'తెలిసి రామ చింతన' అనే మరియొక కృతిని పాడటం మొదలుపెట్టాను. ఎప్పుడైతే అనుపల్లవి ఎత్తుకున్నానో - దానర్థం మనస్సును కొన్ని క్షణాల పాటు కదలని స్థితిలో ఉంచి రామ నామము యొక్క సారాన్ని తెలుసుకో

ఓ మనసా - అని పాడానో అప్పుడు మహర్షి తమ దృష్టిని నావైపుకు మరల్చారు. ఆ తీక్షణమైన చూపు నన్ను నిశ్చలం చేసింది. దానితో నా హృదయం ఒక్కసారిగా ఉప్పొంగింది. అప్పుడు నా మనస్సులో ఎప్పటికీ నేను ఇక్కడే ఉండిపోతే బాగుండునే అని అనుకున్నాను.

అక్కడ ఉన్న వారం రోజులు ఉదయము మరియు సాయంత్రము మూడు గంటలు హాలులో జాగురూకతతో ఉండే వాడిని. మొదటి రోజు తరువాత మా కుటుంబ సభ్యులందరూ ఏ విధమైన చర్చ లేకుండా మౌనంగా మరియు ఏకగ్రీవంగా క్రితం అనుకున్న ప్రణాళికను మార్చుకుని, మిగిలిన రోజులు ఆశ్రమం లోనే ఉండటానికి అనుమతిని కోరటంతో వారు అంగీకరించారు. నేను వెళ్లి కిటికీకి దగ్గరగా రోజూ కూర్చునే ప్రదేశంలో ఏ ఆలోచన లేకుండా ప్రశాంతంగా మహర్షి వైపే చూస్తూ కూర్చున్నాను. అప్పుడప్పుడు ఎవరో ఒకరు మహర్షిని ప్రశ్నించడం, మహర్షి అడిగిన వారి వైపు తల తిరిగేటప్పటికే ఆ ప్రశ్నకు సమాధానము చెప్పేసినట్లు మనకు అనిపిస్తుంది. అలాగే ఎవరైనా ఒకరు సంస్కృతములోనో లేక తమిళంలోనో ఉన్న శ్లోకం యొక్క లేదా వాక్యము యొక్క భావాన్ని వివరించమని అడిగితే మహర్షి వారికి క్లుప్తంగా మరియు మృదువుగా సమాధానము చెప్పేవారు.

మహర్షి ఎక్కువ మాట్లాడేవారు కాదు. ఎన్నో సంవత్సరాలు వారు ప్రజలతో నిర్లిప్తంగా ఉండటం వలన మితంగా మాట్లాడేవారు. తమిళ ఆధ్యాత్మిక సాహిత్యము నందు మహర్షికి ఉన్న జ్ఞానం అపారమైనది; మహర్షి తమంతట తామే శ్లోకాలను కూర్చేవారు.

వారి ఆత్మ సాక్షాత్కారానికి గురువెవరూ మార్గనిర్దేశనం చేయలేదు. అది, వారి అంతః చైతన్యము నుండే జరిగినది. ఆ చైతన్య జ్యోతి వారి అంతరంగం నుండి వారిని ప్రకాశింపజేస్తూ ఉన్నది. వారి శక్తి వంతమైన సంభాషణ అంతర్గతంగా వారి వీక్షణం ద్వారా మరియు మౌనం ద్వారా జరుగుతుంది. వారు సాధారణమైన వ్యక్తిలా మధ్య మధ్యలో నవ్వుతూ మరియు జోకులు వేస్తూ ఉన్నా హాలులో కూర్చున్నప్పుడు మాత్రం హాలంతా మనుషులతో పూర్తిగా నిండి ఉన్నా ఒక్కసారిగా తమ ఆంతరంగిక లోతుల్లోకి వెళ్లి ఆత్మ యందు నిశ్చలంగా మరియు ప్రశాంతంగా వారే చెప్పిన విధంగా ఉనికిగా చైతన్యంతో ఉండేవారు.

ఒకరోజు మధ్యాహ్నం ఎవరో మహర్షికి ఒక కాగితం మీద వ్రాసిన కొన్ని శ్లోకాలను చూపించారు. మహర్షి వాటిని చదివి సంక్షిప్తంగా వ్యాఖ్యానం చేసి ఆ శ్లోకాల యొక్క అర్థాన్ని యోగ వాసిష్ఠం నుండి ఒక కథ ద్వారా స్పష్టం చేశారు. అది నేను విన్నాను. దానిని నేను సంపూర్ణంగా గ్రహించలేక పోయినా వారు చెపుతున్నది నాకు అర్థమయింది. చాలా సంవత్సరాల తరువాత అదే కథను ఆ గ్రంథములో చదివినప్పుడు మహర్షి ఎంత చూడముచ్చటగా సులభమైన రీతిలో మరియు సరళంగా ఆ కథను వర్ణించారో అని నేను ఆశ్చర్యపోయాను. ఆ వర్ణన సూటిగా బాణంలా చొచ్చుకుని పోయి హృదయంలో స్థిరపడిపోతుంది. దీనిని, నేను మౌన భాష అని అంటాను. అటువంటి అనర్గళమైన మౌన భాషతో మధ్య మధ్యలో సంక్షిప్త వ్యాఖ్యలను చేసినప్పుడు ఆ గది అంతటా

మాటలకందని ఒక భావనా తరంగము ప్రతి ఒక్కరినీ స్పృశిస్తూ మరియు అక్కడ ఉన్న వారందరినీ ప్రకాశవంతమైన చైతన్యం లోనికి కొనిపోతోందా అన్న భావన మనకు కలుగుతుంది. మహర్షి సన్నిధిలో మాటలు అనవసరమేమో అని అనిపిస్తుంది. అటువంటి అనుభూతి నాకు వింతగా తోచింది. వారి సన్నిధి మాత్రం చేత నేను సంపూర్ణమైన, తృప్తివంతమైన ఆనందాన్ని అనుభూతి పొందాను.

వారం మొత్తము ఆశ్రమంలో మేము మా సమయాన్ని వినియోగించాము. నేను హాలులో కూర్చోవటం తప్ప విశేషంగా చేసిందేమీ లేదు. ఆశ్రమ పాఠశాల విద్యార్థుల వేద పఠనాన్ని సంధ్యా కాలంలో వింటూ ఉండేవాళ్ళము. నేను, నా సహోదరుడు భగవాన్ కొండ మీదకి వెళ్ళేటప్పుడు క్రిందకు దిగి వచ్చేటప్పుడు నిలబడి చూస్తూ ఉండేవాళ్ళము. అలాంటి ఒకానొక గుర్తుంచుకొనదగిన సందర్భములో నా సహోదరుడు కెమెరాను ఫోటో తీయటం కోసం సరిచేయటం చూసి, మహర్షి రెండు నిమిషాలు స్థిరంగా నవ్వుతూ నిలుచున్నారు. ఇతఃపూర్వము నేనెప్పుడూ అన్ని రోజులు అంత తక్కువగా మాట్లాడటం కాని చాలాసేపు ఊరకే అలా కూర్చోవటం కాని లేదా నన్ను నేను మరచిపోయేంతగా మహర్షి యందే దృష్టి నిలిపి ఏకాగ్రతతో ఉండటం కాని జరుగలేదు. ఏ రోజు సాయంకాలం మేము ఆశ్రమమును వదిలి వెళ్లిపోతున్నామో ఆ రోజున నేను మరియు నా సహోదరుడు మరల మరల మహర్షిని దర్శించటానికి ''ఇంకొక్కసారి'' అని అనుకుంటూ వెళ్ళాము. ఆ

సమయంలో మహర్షి హాలు ప్రక్కన ఉన్న వరాండాలో కూర్చొని కాళ్ళకు తైలంతో మర్దన చేసుకుంటున్నారు. నేను "చివరిగా మహర్షి మనవైపు తల త్రిప్పి ఇంకొక్కసారి చూస్తేనే మనమిక్కడ నుండి కదులుదాము" అని అన్నాను. ఒక నిమిషం లేదా రెండు నిమిషాల తరువాత మహర్షి తమ ముఖాన్ని పూర్తిగా మావైపు త్రిప్పి మమ్మల్ని చూడటంతో ఇంకొక్క మాట మాట్లాడకుండా వెనుదిరిగి అక్కడ నుండి వెళ్ళిపోయాము.

మహర్షిని దర్శించిన తరువాత నా జీవితం మొత్తం సంపూర్ణంగా మారిపోయిందని నేను ధృవీకరించలేను. నేను మరల స్కూల్‌కు వెళ్ళటం అటు తరువాత కాలేజ్, పెళ్లి చేసుకోవటం, ఇంటిని ఏర్పాటు చేసుకోవటం, పిల్లలు కలగటం, విలేకరిగా జీవితాన్ని కొనసాగించటం, ఇలా జరిగింది. కాని నేను రమణాశ్రమం వెళ్ళటం వల్ల ఏదో జరిగింది. అది నా మనస్సులో మరియు హృదయంలో ఒక ముద్రను వేసింది. మహర్షి రూపము మరియు ఆశ్రమ రూపు రేఖలు నా మనస్సులో ఆంతరంగికంగా తెర మీద చిత్రం వలె ఎప్పటికీ మార్పు లేకుండా ఉన్నాయి. ఎప్పుడెప్పుడైతే నేను అలసిపోయానని నాకు అనిపిస్తుందో లేక నిరుత్సాహం కలుగు తుందో లేక గందరగోళానికి గురైనట్లు అనిపిస్తుందో అప్పుడు రమణాశ్రమం వెళ్ళాలనే తీవ్రమైన ఇచ్ఛ నన్ను కమ్మేస్తుంది. నేను విరామం లేకుండా ఎక్కడినుండైనా వస్తున్నానా లేక ఎక్కడికైనా వెళ్తున్నానా అన్న స్పృహ కూడా లేకుండా ఉన్న సమయంలో ఒక్కసారి గోడకు తగిలించిన మహర్షి ముఖచిత్రం వైపు క్షణమాత్రం

చూసినంతనే నా మూలంలోనికి తీసుకుని వెళ్లి అక్కడ నిలకడ చెందేట్లుగా చేస్తుంది. అప్పుడు ఒక్కసారిగా నా మనస్సంతా ఖాళీ అయినట్లు అనిపిస్తుంది.

బలహీనమైన మహర్షి శరీరాన్ని మరణం కబళించే పక్షం రోజుల ముందు నేను రమణాశ్రమం వెళ్లాను. ఎంతో మంది, మహర్షిని దర్శించటానికి వచ్చినందున, ఆశ్రమ అధికారులు అందరికీ దర్శనం జరిగేలా ప్రత్యేకమైన ఏర్పాట్లు చేశారు. తెల్లని జుట్టుతో మందస్మితులై ఉన్న మహర్షి ఎక్కడైతే తమ తుది శ్వాసను విడిచారో ఆ గది ముందు వరండాలో కుర్చీలో కూర్చుని అందరికీ దర్శనమిచ్చారు. కొన్ని క్షణాల పాటు క్రింద నిలబడి మెరిసిపోతూ ఉన్న కళ్ళతో ప్రశాంతమైన మరియు కరుణాపూరితమైన దృష్టిని సారిస్తున్న మహర్షి వంక చూసినప్పుడు భౌతికంగా మహర్షిని శరీరంతో చూడటం ఇది చివరిసారి అని నాకు అనిపించింది.

ఆశ్రమానికి కొన్ని సంవత్సరాల తరువాత మరల వెళ్లాను. ఎప్పటిలాగానే నేను ఆశ్రమం గేటులోకి ప్రవేశించగానే ఆశ్రమం యొక్క ప్రశాంతత నన్ను ఆవరించి నా మనస్సును ఖాళీ చేసింది. నేను వెళ్లి వరండాలో కూర్చుని ఎడమ వైపు తల త్రిప్పినప్పుడు అరుణగిరి తిరిగి ఆ కళ్ళను త్రిప్పి సమాధి స్థితిలో నా మనస్సులోనికి చూసుకుంటే సోఫాలో కూర్చున్నట్లుగా ఉన్న మహర్షి దర్శన మిచ్చారు. నేను ఆ రోజంతా అక్కడే ఏమీ చేయకుండా చదవ కుండా, వ్రాయకుండా, తినకుండా ఆలోచించకుండా ఏమీ గుర్తు తెచ్చుకోకుండా ఎందుకంత ప్రశాంతంగా ఉన్నానో అని ఆశ్చర్య

పోకుండా లేక అందరూ ఎక్కడున్నారని చూడకుండా ఉన్న సమయంలో ఒక కుఱ్ఱవాడు "నెహ్రూ గారు శరీరాన్ని త్యజించారు" అని అరుచుకుంటూ వచ్చిన ఒక శబ్దం మాత్రం వినిపించింది. అన్ని గంటలూ ఒక్క క్షణం కూడా నేనెక్కడో ఉండాలని కానీ లేక ఏదో చేయాలని కానీ నాకు అనిపించలేదు.

ఇంటి నుండి కుటుంబ సభ్యుల నుండి స్నేహితుల నుండి పుస్తకాల నుండి నేను చేసిన తప్పుల నుండి భయం కలగినప్పుడు బాధలు ఎదురైనప్పుడు నా మనస్సు అప్రయత్నంగా రమణాశ్రమం వైపు తిరుగుతుంది. దానికి అనుసంధానంగా నా శరీరం కూడా నా మనస్సును అనుసరిస్తుంది. అప్పుడు తిరువణ్ణామలైకి వచ్చి ఆశ్రమంలోకి ప్రవేశించి హాలులోకి వెళ్లినప్పుడు నేను నా ఇంటికి చేరి సంపూర్ణమైన శాంతిని పొందినట్లు భావించేవాడిని.

ప్రతి మనిషికి ఒక్క తల్లి ఎలా ఉంటుందో అలానే ఒక్క గురువే ఉంటాడు. కొంతమంది అదృష్టవంతులు గురువును కలుసుకుంటారు కొంతమంది రాత్రిపూట వెళ్ళే ఓడలలా వారి ప్రక్కనుండే వెళతారు. పన్నెండేళ్ళ వయస్సు ఉన్నప్పుడు గురువు నాకు ఎదురు పడ్డాడు. నేనిప్పుడు నాలో నేను, ఒక్కడినే ఉన్నాను. ఇంకొక కోణంలో వేరొక స్థానంలో నిలబడి చూస్తే నేను ఇప్పుడే పన్నెండేళ్ళు దాటి పదమూడవ ఏట ప్రవేశిస్తున్నట్లు మరల గుర్తు చేసుకుంటూ వేచి చూస్తున్నట్లు అనిపిస్తుంది.

******

**అధ్యాయము - 4**

# భగవాన్ భక్తులు - గోవులు

**శ్రీ రమణాశ్రమ ప్రచురణ** Bhagavan Ramana The Friend of all **లోని 4వ అధ్యాయానికి స్వేచ్ఛానువాదం**

(గత సంచిక తరువాయి) వి. రమేష్ బాబు

ఆమెకు అంతా అర్థమవుతుంది. నిజంగా ఆమే చాలా చురుకైనది. శంకుస్థాపన పూర్తయి అందరూ వెళ్ళిపోయిన తరువాత, భగవాన్ అణ్ణామలై స్వామితో ఆశ్రమంలో గోశాల నిర్మాణం ఎవరు చేస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి ప్లాను మార్చాలి. భవిష్యత్తులో ఎన్నో ఆవులు ఆశ్రమానికి రాబోతున్నాయి. పెద్ద భవంతిని నిర్మించాలి. లక్ష్మి గోశాల కోసం చాలా దృఢమైన విశాలమైన భవంతి కావాలి.

గ్రానైట్ రాళ్ళతో గోడలు నిర్మించాలి. గోశాల ప్రవేశానికి ముందు పెద్ద వరండా ఉండాలి. ప్రక్కనే నిల్వచేసుకోవడానికి స్టోర్ రూములుండాలి. లోపలి భాగంలో డిజైన్ చాలా ప్రత్యేకంగా ఉండాలి. వరండా నుండి భవన ప్రాంగణంలో కొంత భాగంపైన ఏ అచ్ఛాదనా లేకుండా ఉండాలి. అందువల్ల గాలి, సూర్యకాంతి లోపలికి బాగా వస్తాయి. మనం గాలి, వెలుతురు కోసం వదలిన ప్రదేశంలో రూఫ్ బదులుగా ఇనుప గ్రిల్స్‌తో మూసి ఉంచాలి. ఆశ్రమానికి ఆనుకుని దట్టమైన అడవి ఉన్నది. భగవాన్ ఉద్దేశం రూఫ్ లేని తెరచి ఉంచిన ప్రదేశం నుండి చిరుతలు దూకి వచ్చి ఆవుదూడలను ఎత్తుకుపోయే ఆపద పొంచి ఉందని భావించారు.

భవనానికి బీములుగా బర్మాటీక్ వుడ్ దుంగలు వాడాలని భవన ప్రాంగణానికి ఆలంబనగా రాతి స్తంభాలు అందంగా నిలబెట్టాలని గ్రానైట్ ఫ్లోరింగ్ వేస్తే అందంగా ఉంటుందని భావించారు. శుభ్రం చేసుకోవడమూ తేలికగా ఉంటుంది. లోపలి గోడలను ఆనుకుని పశువులకు ఆహారం వెయ్యడానికి తొట్టెలలాగా కట్టాలని, కొన్ని ఆహారం (పశుగ్రాసం) పెట్టడానికి, మరికొన్ని నీళ్ళు తొట్టెలగా వాడుకోవడానికి వీలుగా ఉండాలి. నీళ్ళు నిలువ చేయుటకు నీళ్ళ ట్యాంకులు ఉండాలి. పశువులను కట్టి వేయుటకు పెద్ద కొయ్యమేకులు, దూరం దూరంగా ఉండాలి. భవనానికి వెలుపలి వైపు వరండాలాగా ఉండాలి. వరండాలో లేగదూడలను కట్టి ఉంచవచ్చు. భవనానికి ముందు, వెనుక, గట్టి మందపాటి టేకు తలుపులు ఉండాలి.

గోలక్ష్మి అందిస్తున్న సేవల చేత ఆశ్రమం ఎంతో ఎదిగి అభివృద్ధి లోకి వస్తుంది అన్నారు భగవాన్. ఒకరు లక్ష్మి కోసం గోశాల నిర్మిస్తే తప్పకుండా మరికొందరు ముందుకు వచ్చి పుణ్య సంపాదన కొరకు గ్రంథాలయము, భోజనశాల మాతృభూతేశ్వర దేవాలయము నిర్మిస్తారు. గోశాల పూర్తయింది. గృహ ప్రవేశానికి ముహూర్తం నిర్ణయించారు.

గోశాలను తోరణాలు, మామిడాకులు, పూలతో అలంకరించారు. భవనం ముందు ముగ్గులు పెట్టారు. ఆశ్రమ వాసులందరూ ఆవులరాణి, గోలక్ష్మి ముందుగా గోశాలలోకి ప్రవేశించాలని నిర్ణయించుకున్నారు.

గోలక్ష్మికి స్నానం చేయించారు. పసుపు కుంకుమలు పులిమారు; పూలదండలతో అలంకరించి నూతన గృహప్రవేశానికి ఆమెను సిద్ధం చేశారు. ఇంతలో గోలక్ష్మి అక్కడ నుండి జారుకుని సోఫాలో విలాసంగా వెనుకకు వాలి పేపర్ చదువుతున్న భగవాన్ వద్దకు చేరి ఆయన తనతో వస్తే తప్ప కదలనని భీష్మించుకుని కూర్చున్నది.

భగవాన్‌కు బోధపడి నెమ్మదిగా లేచి నడక ప్రారంభించారు. గోలక్ష్మి భగవాన్ వెనుక నడక సాగించింది. భగవాన్ గోశాలలోకి ముందు ప్రవేశించిన తరువాతనే గోలక్ష్మి గోశాలలోకి వెళ్ళింది. మిగిలిన ఆవులు, ఇతర భక్తులు వారిని అనుసరించారు.

ప్రతి శుక్రవారం గోలక్ష్మికి స్నానం చేయించిన తరువాత నుదుట పసుపు కుంకుమలు పెట్టి తాజాపూల దండలతో ఆమె మెడ కొమ్ములు అలంకరించేవారు. ఆ తరువాత గోలక్ష్మి హాలులోకి వచ్చి గురువు భగవానుకు తన అలంకరణ చూపేది. భగవాన్ ఆమెను తాకగానే ఆమె ధ్యానంలో లీనమయ్యేది.

కొన్నిసార్లు గోలక్ష్మి తన కఱకు నాలుకతో భగవాన్ చేతులు నాకేది. తన చేతులు ఎఱ్ఱబడి బొబ్బలెక్కుతున్నా భగవాన్ చేయి వెనుకకు తీసుకునేవారు కాదు. గోలక్ష్మి తన తనివితీరా భగవాన్ చేతులునాకి ఆ తరువాత ప్రసాదంగా తనకిష్టమైన కొండ అరటి పండ్లు తిని తిన్నగా గోశాలకు వెళ్ళేది.

ఒకసారి ''మాట్టు పొంగల్'' అనగా తెలుగు వారి కనుమ పండుగ రోజు మామూలుగా చేసే పసుపు కుంకుమ పూలదండల

అలంకరణతో బాటుగా కూరగాయల దండలు కూడా వేసి అలంకరించారు. గోలక్ష్మి ఆ రోజు స్వర్గం నుండి దిగి వచ్చిన కామధేనువు లాగా గోవుల రాణిలా వైభవంగా వెలిగిపోయింది.

ఆ రోజు భగవాన్ పది గంటలకు తన పశు భక్తులను ఆశీర్వదించుటకు వచ్చారు. అందంగా అలంకరించిన గోలక్ష్మి ప్రక్కన కుర్చీలో కూర్చున్నారు.

భక్తులు వేదమంత్రాలు “నకర్మణా న ప్రజయా” వంటివి చదువుతూ కర్పూర హారతులిచ్చారు. కొందరు భక్తులు అందంగా అలంకరించిన గోలక్ష్మిని, భగవాన్‌ని ఫోటో తీసుకుంటామని కోరారు.

గోలక్ష్మిని గోశాల మధ్యకు నడిపించారు. భక్తులు పెద్ద సమూహంగా అక్కడ చేరిన వారిని ఒక అడుగు ప్రక్కకు నిలవ మన్నారు. గోలక్ష్మి తన తలను ఎంతో అందంగా గర్వంగా ఎగురు వేసింది. భగవాన్ లక్ష్మి ప్రక్కన నిలబడి ఆమె తల, వీపు తన ఎడమచేతితో నిమరసాగారు.

భగవాన్ గోలక్ష్మితో లక్ష్మీ - నిలబడు చక్కగా నిలబడు అని చెప్పగానే గోలక్ష్మి కన్నులు మూసుకుని సమాధిలో ఉన్నట్లు నిశ్శబ్ద మౌనంలో ఉండిపోయింది. భగవాన్ తన కుడి చేయి లక్ష్మి మీద ఉంచి తన చేతికర్రను ఎడమచేత్తో పట్టుకుని ఆమె ప్రక్కనే నిలుచున్నారు. అది ఒక అపూర్వ దివ్య దృశ్యము. ఫోటోగ్రాఫరు రెండు మూడు ఫోటోలు తీశాడు.

*(సశేషం)*

# The Desire for Respectability

Dr K Subrahmanian

Almost every one of us would like to be labelled respectable. In the name of respectability, we do a lot of things because a person is considered respectable if he does something or is something. We are respected for the position that we occupy, for our scholarship, our ability to speak, and so on. When others tell us we are respected for a particular reason, we are happy. In other words, our whole life is spent in convincing people that we are respectable, and we are happy when people respect us. So long as we have this interest in respectability, we spend a lot of our time in cultivating it. Therefore, when people tell us that we are respectable, they attribute certain qualities to us, and whether we have them or not, we believe we have them – or would like to have them. Since people think we have these qualities, we spend our whole life living up to the image they have of us. In other words, we are not interested in what we are. In this process of living up to the image of other people, we destroy ourselves.

If you all say that Subrahmanian is a great devotee of Bhagavan, I try to give you the impression that I am, even though I may not be. In other words, I try to be something which I am not. The moment I try to be something I am not, there is conflict – and conflict, leads to unhappiness. So, whatever might be your image of me, if I am not what you think me to be, and I try to be what you think me to be, then as an individual, I am completely destroyed. If

somebody calls you a great scholar, even though you may not know much in that field, you pretend to know because you want to live up to their expectations. The moment I realise that I am not a respectable person, I cease to be respectable. The moment I realise I must not be interested in your thinking me to be respectable, what happens to me? Then I realise that I am just like anybody else. My knowledge and positions are accidents. I am also, then, not interested in seeking appreciation or admiration. The moment I feel that I am a nobody, there is no conflict of any kind.

The feeling that I am somebody is the result of the mind. The mind tells me that I am better than other people, and therefore, I would like to cling to that aspect to make me feel that I am better than other people. If, by the grace of God, I don't consider myself to be inferior or superior to other people, then this is the result of humility that is born out of real understanding. For example, when a man says we all admire people who have conviction, what does he mean? A man of conviction, whatever be the conviction, is a person who will not change his opinion, whatever might happen. We all have great admiration for such people. In other words, what happens is, the person will not budge. We are taught to believe that such people are extraordinary. But the problem is that life is not static; we can't keep holding on to something permanently, especially at the cost of truth. The moment I consider my principles most important, and hold on to them, I may be admired by other people, but from time to time I may have my own doubts if what I am doing is right. But I don't share this

with other people because other people would cease to think that I am a man of principles. So, the whole object of our life is to live up to the image of what other people have of us.

If we do this, however, we then cannot seek truth because we don't know what it is. We cannot seek *brahman* because we don't know what it is. We say that it is something beyond the mind – if that is the case, then how do we seek it? We have no idea of what it is, and yet, we have an image of *brahman*, we have an image of truth, we have an image of God, and we seek all these things with our limited minds. Our limited minds will create only limited Gods; it will create an image like us, perhaps slightly better. In other words, if we are petty, we would also have an image of a petty God. We would think that our God would be offended if we didn't put a hundred rupees in the *hundi* or would punish us if we did not think of him for five minutes in the morning. Our idea of God is someone who is similar to us!

